ఎమ్మెల్యే సారూ.. కరుణించండి


శిథిలావస్థలో బాలికల పాఠశాల భవనం

- శిథిలావస్థలో బాలికల పాఠశాల
- వరండాతో పాటు మూడే తరగతి గదులు
- పాఠశాలలో 229 మంది విద్యార్థినులు

అమరచింత: ఎమ్మెల్యే సారూ.. పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది జర మా బాధలు పట్టించుకోండని బాలకల పాఠశాల విద్యార్థినులు వేడుకుంటున్నారు. బేటీ బచావో–బేటీ పడావో అన్న నినాదంతో పాటు బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకొస్తున్న ప్రభుత్వాలు శిథిలావస్థకు చేరువలో ఉన్న పాఠశాలను పట్టించుకోలేక పోతున్నారని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసి కొత్త తరగతి గదుల నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టినా.. అధ్వాన్నంగా ఉన్న తమ పాఠశాలను గుర్తించలేదని వాపోయారు. పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, పైకప్పు పెచ్చులూడుతున్నాయని ప్రధానోపాధ్యాయుడు మండల, జిల్లా విద్యాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది.

భయం గుప్పిట్లో..

పాఠశాలలో ఆరో తరగతి గదిలో కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు పడుతాయో అన్న భయంతో చదువులను కొనసాగించాల్సిన పరిస్థితి దాపరించింది. వీటితో పాటు పాఠశాల వరండా మొత్తం పూర్తిగా దెబ్బతింది. పాఠశాలకు సంబంధించిన సభలు, సమావేశాలు నిర్వహించుకుందామనుకున్న భయపడే పరిస్థితి ఏర్పడిందని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ తెలిపారు. ఏడో, ఎనిమిదో తరగతి గదులు మరింత అధ్వాన్నంగా ఉన్నాయనే విషయాలను స్థానిక ప్రజాప్రనిధులకు తెలిపినా పట్టించుకోలేక పోతున్నారని వెల్లడించారు.

భయంగా ఉంది



తరగతి గదిలో కూర్చున్నంత సేపు భయంతో ఉండాల్సి వస్తోంది. ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయో అన్న దుస్థితి దాపరించింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తమకు ల్యాబ్ రూంలో పాఠాలు చెబుతున్నారు.
– అనిత, 10వ తరగతి

వరండాలో నిల్చోలేకపోతున్నాం



పాఠశాలలోని వరండాల్లో కాసేపు నిల్చోలేని పరిస్థితి దాపరించింది. ఇంటర్వెల్, మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదులకు వెళ్లి భోజనం చేస్తున్నాం. పాఠశాలకు సరైన వసతులు లేవు. ఎమ్మెల్యే స్పందించి తమ పాఠశాలకు నిధులు మంజూరు చేయాలి.
– లహరి, 9వ తరగతి

ఉన్నతాధికారులకు విన్నవించాం



పాఠశాలలోని తరగతి గదుల పరిస్థితిని ఉన్నతాధికారులకు విన్నవించాం. మన ఊరు–మన బడిలో తమకు కావాల్సిన వసతుల కల్పించాలని కోరాం. కానీ తమ పాఠశాలను మొదటి విడతలో గుర్తించలేదు. దీంతో పాఠశాలలోని తరగతి గదుల పైకప్పు ఎప్పుడు కూలుతుందో అన్న సందేహాలతో విద్యార్థినులకు పాఠాలు చెబుతున్నాం.
– కరుణాకర్, జీహెచ్ఎం

అమరుల త్యాగం మరువలేనిది


వనపర్తిలో అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు


ఆత్మకూర్‌లో..

వనపర్తి రూరల్: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో హైదారాబాద్‌లోని బషీర్‌బాగ్ పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు అర్పించిన విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ త్యాగాలు చిరస్మరణీయమని సీపీఐ, సీపీఎం నాయకులు అన్నారు. సీపీఐ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అమరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పృథ్వీరాజ్, కళావతమ్మ, రమణ, కాకం కాశన్న, రాశి, రమేష్, సీపీఎం నాయకులు ఎండీ జబ్బార్, పుట్టా ఆంజనేయులు, కురుమయ్య, వనగంటి నాగేశ్వర్, గంధం మదన్, గట్టయ్య, పరమేశ్వరాచారి, రమేష్, బీసన్న, మన్యం, రాములు, రత్నయ్య, బాలపీరు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకుకి బుధవారం మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఆపార్టీ మండల కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని హైదరాబాద్ నడి బొడ్డున బషీర్‌బాగ్‌లో వామపక్ష పార్టీలు చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఉద్యమకారులపై పోలీసులు లాఠీచార్జ్, రబ్బర్ బుల్లెట్లు, భాష్ప వాయువు గుండ్లను ఉపయోగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు చెన్నయ్య, సి ప్రసాద్, వెంకటేష్, సత్యనారాయణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, వెంకటేష్, రమేష్, బుచ్చన్న, రాఘవేంద్ర, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రభుత్వాలే కూలిపోతాయని ఇందుకు గతంలో జరిగిన విద్యుత్ పోరాటంతో టీడీపీ ప్రభుత్వం కూలిపోయిందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ రాజు అన్నారు. బుధవారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో రవిప్రకాష్, ఇస్మాయిల్, కృపాదానం, నసీర్, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

నేడు డీసీసీబీ చైర్మన్‌కు అభినందన సభ

పాన్‌గల్: డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో గురువారం అభినందన, సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు సీఈఓ భాస్కర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విండో డైరెక్టర్లు, అభిమానులు, కార్యాలయం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము బుధవారం ఆర్టీసీ ఎండీ పీఏ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ ప్రారంభమైనప్పటి నుంచి మూత్రశాలలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, ప్రస్తుత రద్దీకి అనుగుణంగా మూత్రశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని, పసిపిల్లల తల్లులకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు మహిళలు ఉన్నా బస్సును ఆపడం లేదన్నారు. వనపర్తి డిపో నుంచి తిరుపతికి బస్సు పునఃప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, నాయకులు సీతారాములు, రవి కుమార్, నవీన్ చారి, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శాగాపూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంతో పాటు రాష్ట్రంలో నూటికి 50 శాతం మంది బీసీ జనాభా కలిగి ఉన్నా.. వారికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించకపోవడం వారిని విస్మరించడమే అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం అన్ని కూలాలకు సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి బహిరంగ సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, హామీ మేరకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

కొత్తకోట: ప్రతి ఉపాధ్యాయుడు పదవీ విరమణ అనంతరం భావి జీవితాన్ని విద్యారంగానికే కేటాయించాలని వనపర్తి జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. బుధవారం మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సూర సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సత్యనారాయణ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజమని, సత్యనారాయణ 40ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానటువంటి బదిలీలు, పదోన్నతులను చేపట్టి ఉపాధ్యాయులకు న్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గురుప్రసాద్‌రావు, బౌద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్ గేమ్‌లతో చదువును ఆగం చేసుకోవద్దు'


రేవల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న పోలీసులు

అమరచింత: విద్యార్థులు మొబైల్ ఫోన్ల మోజు పడి ప్రతినిత్యం ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ చదువులకు దూరమవుతున్నారని, ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌పై శ్రద్ధ వహించడం లేదని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని మస్తీపురం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ క్రైమ్, మొబైల్ గేమ్, యాంటీ డ్రగ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక వనరులను వినియోగించుకోవాలే తప్ప వాటినే అనుకరిస్తూ చదువును నిర్లక్ష్యం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లతో తల్లిదండ్రులకు తెలియకుండా బెట్టింగ్‌లు పెడుతూ చేసిన అప్పులు తీర్చలేక చెడు మార్గాలపై దృష్టి సారిస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని రేవల్లి ఎస్ఐ రాము అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తల్పునూరులో అవగాహన కల్పించారు. భద్రత విషయంలో యువకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏవైనా దొంగతనాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు మొదటి ప్రాధాన్యత పనిచేస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు దాతలు, గ్రామ పెద్దలు ముందుకు రావాలని కోరారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదని, లైసెన్స్ ఉన్నవారు మాత్రమే డ్రైవింగ్ చేయాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించిన కరపత్రాలను ఎస్ఐ రాము చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోడ్‌సేఫ్టీ ఆర్గనైజేషన్ సభ్యులు కావలి కృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఎల్లస్వామి, గోవర్ధన్, కురుమూర్తి పాల్గొన్నారు.


మస్తీపురంలో..

క్లుప్తంగా

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం



మదనాపురం: మండలంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న బీటీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా పనులు చేస్తున్నారని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లె రాజశేఖర్‌యాదవ్ బుధవారం పంచాయతీరాజ్ శాఖ డీఈ మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. నెలివిడి నుంచి నర్సింగాపూర్ తండా వరకు వేసిన రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోయిందని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రానున్న రోజుల్లో రోడ్డు త్వరగా పాడైపోతుందని విన్నవించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గోపాల్‌పేట: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బుధవారం పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు చెన్నూరు వైపు వెళ్తుండగా ఓ ఇసుక ట్రాక్టర్ రావడంతో.. ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని డ్రైవర్‌ను కోరగా ఎటువంటి పత్రాలు లేవని చెప్పారు. దీంతో ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఓనర్ గొల్ల పుల్లయ్య, డ్రైవర్ శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన జయమ్మ(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సుభాష్, సుజ్ఞానం, జయరాజు, సతీష్‌రాజ్, యాకోబు, నాగరాజు, మన్యం, షిమియాసోన్, శాంతిరాజు, మేస్త్రీ శ్రీనివాసులు, రాములు యాదవ్, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో జ్వర పీడితులపై ఏఎన్ఎం సుమిత్ర ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కీటక జనిత వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవడం, దోమలు నిల్వ లేకుండా చూసుకుంటే కీటక జనిత రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

గోపాల్‌పేట: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు గాయపడిన ఘటన బుధవారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంకు నుంచి యువకుడు బైక్‌పై గోపాల్‌పేట వైపు మెయిన్‌రోడ్డు మీదకు వస్తుండగా వనపర్తి నుంచి హైదారాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం రోడ్డు పక్కకు పడిపోగా యువడికి గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు, పోలీసులు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. గోపాల్‌పేట మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద, బ్యాంకు ముందు పెట్రోల్ బంకుల ముందు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకోకముందే జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు


షాపురంలో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు చేస్తున్న భక్తులు


శ్రీరంగనాథస్వామి విగ్రహాల ఊరేగింపు

ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురంలో కృష్ణాష్టమి వేడుకలను త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు స్వామివారి వేడుకలను గ్రామంలో నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమకు పూజలు చేసి, ప్రజలు, సేవాసమితి సభ్యులు గ్రామంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల్లో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక షాపురం, మద్దిగట్ల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అంజి, రాఘవేంద్రాచారి, రవికుమార్, మనోహర్, రమేష్, సుదర్శన్, యాది, శంకర్, మంజుల, సబిత, శిరీష, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించి, ఆలయ ప్రాంగణంలో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్టి కొట్టారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణునారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో నీట మునిగిన పుష్కరఘాట్లు


పుష్కఘాట్ వద్ద శివాలయం సమీపానికి చేరిన వరదనీరు

ఎర్రవల్లి: ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు అధికంగా వరదనీరు వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 45 గేట్ల ద్వారా దాదాపుగా మూడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి దగ్గర బుధవారం కృష్ణానది నిండుకుండలా ప్రవహించడంతో పుష్కరఘాట్లన్ని పూర్తిగా మునిగిపోయాయి. కృష్ణానదికి వరదనీరు అధికంగా రావడంతో శివాలయం సమీపానికి చేరింది.

నిందితులను కఠినంగా శిక్షించాలి


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, ఆవాజ్‌కమిటీ నాయకులు

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింల ఖబరస్తాన్ (శ్మశానవాటిక)లో సమాధులు ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గయాసుద్దీన్ అన్నారు. బుధవారం సీపీఎం, ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుల బృందం కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, జాతీయ మైనార్టీ కమీషన్ సభ్యురాలు సయిద షహజాది బేగం ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది స్వార్థం కోసం వెంచర్లు చేసేందుకు వందల ఏళ్లనాటి సమాధులను కొల్లగొడుతున్నారని, ఘటన జరిగి 40 రోజులు అవుతున్నా నిందితులను గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వేనంబర్లు 517లో 1.8 ఎకరాలు, 2లో 1.20 ఎకరాలు, 1లో 1.33 ఎకరాలు, 518లో 1.66 ఎకరాల స్థలాలు ఉన్నాయని, అతి పురాతనమైన శ్మశానవాటికలోని సమాధులను ధ్వంసం చేసి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో షాహీద్, వాహేద్, ఖాజ, మునీరోద్దీన్ తదితరులు ఉన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

పెద్దకొత్తపల్లి: పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువత నుంచి ఓటరు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఆయా వార్డులలో కుటుంబ సభ్యులంతా ఒకే వార్డులో వచ్చే విధంగా బీఎల్ఓలు ఓటరు నమోదును చేపట్టాలని ఆయన సూచించారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని కోరారు.

నేడు క్రీడాపోటీలు

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఆవరణలో గురువారం మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలు నిర్వహిస్తునట్లు ఎంఈఓ భాస్కర్‌శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు హాజరుకావాన్నారు

రైతుల వివరాల సేకరణ



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల వివరాలు తెలుసుకునేందుకు బుధవారం అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. రైతుల కుటుంబ సభ్యులను వివరాలు సేకరించి సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రైతుల జాబితా ప్రకారం వివరాలు సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు లతీక్, బాలస్వామి, మల్లయ్య ఉన్నారు.

అగ్గిపెట్టే ఇవ్వనందుకు వ్యక్తిపై తాగుబోతుల దాడి

కొత్తకోట రూరల్: మద్యం మత్తులో ముగ్గురు యువకులు కొత్తకోట మండల కేంద్రంలోని శిల్పవైన్స్ వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసి వీరంగం సృష్టించారు. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వడ్డెవాటతండాకు చెందిన పాత్లావత్ ఆంజనేయులునాయక్ కొత్తకోటలోని శిల్పవైన్స్‌లో బీరు తీసుకుని లోపలికి వెళ్లి తాగుతున్న క్రమంలో పక్కనే ఉన్న ఇద్దరు యువకులు సిగరేట్ వెలిగించుకునేందుకు ఆంజనేయులు నాయక్‌ను అగ్గిపెట్టె అడిగారు. అందుకు ఆంజనేయులునాయక్ తన దగ్గర అగ్గిపెట్టె లేదని సమాధానం చెప్పాడు. వీరితో నాకేందుకులే అని వైన్ షాపులోనే మరో చోటుకు వెళ్లాడు. అంతలోనే ఆంజనేయులు వెనుక నుంచి ఇద్దరు యువకులు ఆనంద్, ప్రణయ్ వచ్చి అగ్గిపెట్టే లేదంటావా అంటూ మళ్లీ గొడవకు దిగారు. రోడ్డుపై అటుగా వెళ్తున్న శ్రీశైలం అనే యువకుడిని ఆనంద్ పిలుచుకుని ముగ్గురు కలిసి ఆంజనేయులునాయక్‌పై దాడికి పాల్పడ్డారు. దాడి చేస్తుండగా దెబ్బలకు తాళలేక పరుగెత్తిన వదలకుండా దాడి చేసి గాయపరిచారు. స్థానికులు కల్పించుకోవడంతో వారు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు నాయక్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితుడు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

పాన్‌గల్: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లికి చెందిన కొంకల సహదేవుడు ఈనెల 25వ తేదీన ఇంట్లో ఉండగా అతడి సోదరుడు రాజశేఖర్ తాగిన మైకంలో బూతులు తిట్టగా రాత్రి వేళల్లో మాట్లాడటం సరి కాదని పంపించాడు. 26వ తేదీన కొంకల సహదేవుడు సోదరుడికి ఫోన్ చేసి రాత్రి విషయం మాట్లాడుదామనగా పిలవగా.. అంతలోనే స్నేహితుడితో కలిసి వచ్చిన రాజశేఖర్ బూతులు తిడుతూ కర్రతో దాడి చేసి గాయపర్చడంతో తలకు రక్త గాయమైందన్నారు. బాధితుడు వారి నుంచి తప్పించుకొని ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్న అనంతరం 28వ తేదీన స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడన్నారు. కొంకల సహదేవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.